"ఊరుకుంటేనే ఉత్తమం"

వసుంధర

"ఈరోజొక అద్భుత ప్రయోగం చేయబోతున్నాను సావిత్రీ-" అన్నాడు శేఖరం.

"ఏమిటండీ అది-" అంది సావిత్రి.

"మొక్కలమీద న్యూక్లియర్ రేడియేషన్ ప్రభావం. మొక్కలమీద నేను చేయబోయే ఈ ప్రయోగంవల్ల- పంట దిగుబడి బాగా పెంచవచ్చు. పంట క్వాలిటీని హెచ్చించవచ్చు. ఇంకా రకరకాల ప్రయోజనాలున్నాయి. ఏ సీజన్లోనైనా ఏ పంటైనా పండిచవచ్చు."

"మీ ప్రయోగం ఏ దశలో ఉంది-" అంది సావిత్రి.

"ఇంకా గ్రుడ్డు దశలోనే ఉంది. ఈ రోజే మొదటి దశ ప్రారంభం. మా లాబొరేటరీ నా గురించి కొన్ని

పొలాలు కొంది. వాటిలో నేను వేసిన విత్తులు మొక్కలై న్యూక్లియర్ రేడియేషన్ అందుకునే దశకు ఇప్పుడిప్పుడే వచ్చాయి. ఇంక నా ప్రయోగం మొదలు కావాలి. ఈ రోజే అందుకు ముహూర్తం పెట్టాను-" అన్నాడు శేఖరం.

శేఖరం-ప్రభుత్వ పరిశోధనాసంస్థలో సైంటిస్టుగా పని చేస్తున్నాడు. యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేస్తున్నప్పుడు తనతోపాటు రీసెర్చి స్కాలర్‌గా ఉండే సావిత్రి నతడు ప్రేమించి పెళ్ళాడాడు. భర్త ఎంత ప్రోత్సహించినా వినకుండా-పెళ్ళి కాగానే సావిత్రి రీసెర్చికి స్వస్తి చెప్పింది.

శేఖరం భార్యకు టాటా చెప్పి-ఆఫీసుకు వెళ్ళి అక్కణ్ణించి-తన ప్రయోగాల కవసరమైన ఎక్విప్‌మెంట్‌ను వ్యాన్‌లో వేయించుకుని-నలుగురు అటెండెంట్సుని తీసుకుని బయల్దేరాడు. ఆఫీసునుంచి పొలాలకు చేరడానికి సుమారు పదిహేను నిముషాలు పట్టింది. పొలం మధ్యలో ఒక చిన్న గది ఉంది. ఆ గదికి విద్యుచ్ఛక్తి సదుపాయాలున్నాయి. శేఖరం తన ఎక్విప్‌మెంటు నక్కడికి తరలింపజేసి వ్యాన్ డ్రైవర్‌తో-మళ్ళీ ఎప్పుడు రావాలో చెప్పిపంపించేశాడు.

తర్వాత ఒకొక్క ఇన్‌స్ట్రుమెంటుకీ ఎలెక్ట్రికల్ కనెక్షన్సిచ్చాడు. నెమ్మదిగా అతని ప్రయోగాలు ప్రారంభమయ్యాయి.

శేఖరం చేయబోయే ప్రయోగాల ఫలితాలు తెలుసుకోవడానికి కొంత వ్యవధి కావాలి. అందువల్ల శేఖరం తన నోట్‌బుక్‌లో ఆ రోజు తేదీ వేసుకుని-ఏయే మొక్కలకు

ఎంతెంత ఫ్రీక్వెన్సీలో ఏయే రేడియేషన్ ఇచ్చినదీ నోట్ చేసుకోసాగాడు. అతనలా చేసుకుంటూండగా ఆకాశం హఠాత్తుగా మేఘావృతమైంది. అతని మీద ఒకటి రెండు చినుకులు కూడా పడ్డాయి.

శేఖరానికి చిరాకు కలిగింది. మంచి పనుల కెప్పుడూ విఘ్నాలే! అతను ఇన్‌స్ట్రుమెంట్స్‌మీద రెయిన్ ప్రూఫ్ కవర్సు కప్పి-ఎలక్ట్రికల్ కనెక్షన్సు తీసేసి-కేబుల్సు గది లోకి మార్చేశాడు. అతనివన్నీ ముగించేసరికి ఆకాశంలో మబ్బులు తొలగి పోయి- మళ్ళీ మామూలు వాతావరణ మేర్పడింది.

"అయితే కేవలం నా ప్రయత్నానికి విఘ్నం కలిగించడం కోసమే నన్నమాట-వాతావరణంలో మార్పు వచ్చింది-నేనా లొంగేవాడిని-" అనుకుని శేఖరం ఉత్సాహంగా మళ్ళీ ఎలక్ట్రికల్ కనెక్షన్సు ఇచ్చి తన ప్రయోగాలు ప్రారంభించాడు. అతని ప్రయోగం జరుగుతుండగా మళ్ళీ ఆకాశం మేఘావృతమైంది. అతని మీద ఒకటి రెండు చినుకులు పడ్డాయి.

శేఖరానికి చాలా చిరాకు వేసినా చేయగలిగినదేమీ లేదు. అతను మళ్ళీ ఇందాకటిలాగే ఇన్‌స్ట్రుమెంట్సు డిస్కనెక్ట్ చేసి వచ్చేసరికి-వాతావరణం మళ్ళీ మామూలై పోయింది. పట్టువదలని విక్రమార్కుడిలా శేఖరం తన ప్రయోగాలు మళ్ళీ ప్రారంభించాడు. అయితే మళ్ళీ ఇందాకటిలాగే జరిగింది.

అంతేకాదు-అలా అయిదారుసార్లు జరగడంలో శేఖరానికి చిన్న అనుమానం కూడా వచ్చింది. తన ప్రయోగాలకూ - వాతావరణంలోని ఈ మార్పుకూ ఏమీ

సంబంధం లేదుకదా అని! ఎందుకంటే ప్రయోగం ఒక దశకు వచ్చే సరికి వాతావరణంలో మార్పు వస్తోంది. ప్రయోగం ఆపివేయగానే వాతావరణం మామూలై పోతోంది.

శేఖరం దీక్షగా తను నోట్ చేసుకున్న రీడింగ్సువైపు చూశాడు. వాటిలో అతను ప్రయోగం ఎప్పుడెప్పుడు ఎక్కడెక్కడ ఆగిందీ నోట్ చేసుకున్నాడు. ఆ విషయం చూడగానే శేఖరం ఆశ్చర్యానికి అంతులేదు. ప్రతిసారీ కూడా గామా రేడియేషన్ ఒక పర్టిక్యులర్ ఫ్రీక్వెన్సీలో వదిలినప్పుడు ప్రయోగం ఆగిపోయింది.

శేఖరానికి ఉత్సాహం వచ్చింది. ఈసారి అతను అదే ఫ్రీక్వెన్సీలో గామా రేడియేషన్ అప్లై చేసి చూశాడు. కానీ వాతావరణంలో మార్పు రాలేదు. అయితే ఇందాకటి మార్పు కాకతాళీయమై ఉండాలని సరిపెట్టుకుని మళ్ళీ తన ప్రయోగాన్ని ప్రారంభించాడు శేఖరం.

అక్కడ పదేసి మొక్కలు ఒక వరస చొప్పున పాతబడి ఉన్నాయి. శేఖరం మొదటి మొక్క దగ్గర ప్రారంభించి ఫ్రీక్వెన్సీలు మార్చుకుంటూ రేడియేషన్ అప్లై చేస్తున్నాడు. ఇంతవరకూ అతను వరస పూర్తి చేసినపుడల్లా వాతావరణంలో మార్పు వచ్చింది. కానీ తన ప్రయోగానికీ వాతావరణంలో మార్పుకీ సంబంధం లేదని గ్రహించిన శేఖరం నెమ్మదిగా మళ్ళీ ఇంకో వరస మొదలు పెట్టి పూర్తి చేసేసరికి_వాతావరణంలో ఇందాకటిలాగానే మార్పు వచ్చింది.

శేఖరం బుర్రలోని సైంటిస్టు పని చేయసాగాడు. ఖచ్చితంగా తన ప్రయోగాలకీ_ఈమార్పుకీ సంబంధముంది. ఎటొచ్చీ తను సరిగ్గా ఆలోచించలేక పోతున్నాడు.

అతను తన నోట్ బుక్ దగ్గర పెట్టుకుని రకరకాలుగా ఆలోచించసాగాడు. హఠాత్తుగా అతనికి స్ఫురించింది. వాతావరణంలో మార్పురావడానికి కారణం-రేడియేషన్ ఒక పర్టిక్యులర్ ఫ్రీక్వెన్సీలో వెళ్ళడం కాదు. సీక్వెన్స్. పది రకాల ఫ్రీక్వెన్సీలు-తను అప్లై చేసిన సీక్వెన్స్‌లోనే వేసుకుంటూ వాడితే ఈ మార్పు వస్తూ ఉండవచ్చు.

ఇది నిజమో కాదో తెలుసుకునేందుకు తను రకరకాల సీక్వెన్సులు మార్చి ప్రయోగాలు చేశాడు. వాతావరణంలో మార్పు రాలేదు. కాని తనిందాకటినుంచే అప్లై చేస్తున్న సీక్వెన్సు ఫాలో అయితే ఏదో ఫ్రీక్వెన్సీ దగ్గరకు వచ్చే సరికి మేఘాలు వర్షించేస్థితికి వచ్చాయి. ఆ సీక్వెన్సునే ఫాలో అవుతూ ఫ్రీక్వెన్సీంకా పెంచుకుంటూ పోతే-వర్షం బాగా ఉధృత మవుతుందని కూడా శేఖరానికి తట్టింది.

అదే నిజమైతే-తనొక కొత్త విశేషాన్ని కనుగొన్నట్లు లెక్క! కావాలనుకున్నప్పుడు వాన కురిపించగల శక్తి తను సంపాదించాడు. అంతేకాదు కోరినంత సేపు మాత్రమే వాన కురిపించగల శక్తి కూడా తనకుంది. తను ప్రయోగాన్ని ఆపే ఫ్రీక్వెన్సీ నంబరుని బట్టి-వర్షం కురసే వ్యవధి ఉండవచ్చు, కానీ అందుకు మరికొన్ని ప్రయోగాలు చేయవలసి ఉంటుంది.

శేఖరం అనుమానం-కేవలం రేడియేషన్ ఒక్కటే ఈ విశేషానికి కారణం కాదని, బహుశా తను నాటిన ఈ మొక్కలు కూడా అందుకు దోహదం చేస్తూండవచ్చు. లేదా ఈ ప్రాంతపు వాతావరణం కూడా అందుకు కారణం కావచ్చు. ఈ విషయంలో ఒక నిర్ణయానికి వచ్చే ముందు తనింకా చాలా ప్రయోగాలు చేయాల్సుంటుంది.

శేఖరం త్వరత్వరగా తన ఆలోచనలన్నీ కాగితం మీదకు ఎక్కించసాగాడు.

2

"మీదీ మీ వారిదీ ఒకే సబ్జకు కదా-మీరూ ఉద్యోగంలో చేరి మీ వారికి సహాకరించరాదూ" అంది అరుణ.

"నేను విజ్ఞానం కోసం చదువుకున్నాను. నేను ఉద్యోగం చేస్తే మరికాస్త డబ్బు సంపాదించ వచ్చునను కోండి. ఉద్యోగం చేసే ఆడది-సరైన సంసార జీవితానివ్వలేదు. అవసరమున్నప్పుడు తప్పదు. అవసరం లేనప్పుడు ఉద్యోగం చేయడమెందుకు చెప్పండి!" అంది సావిత్రి.

"మీ రింకా చాలా పాతకాలంలో ఉన్నారు. ఆడవాళ్ళిప్పుడు ఇతర గ్రహాలక్కూడా పోతున్నారు" అంది కరుణ.

"కాదని నేనలేదు. కానీ భగవంతుడు ఆడదాన్ని బలహీనంగా, సుకుమారంగా సృష్టించాడు. ఎంతో ఓర్పునూ, త్యాగబుద్ధినీ ఇచ్చాడు. ఇవన్నీ ఉపయోగించి ఆడది ఒక ఆహ్లాదకరమైన వాతావరణానికి తాను రాణియై-తనకు చెందిన వాళ్ళందరినీ పరిపాలించాలి. అలా జరగనప్పుడు - ఇప్పుడొచ్చిన మోడ్రన్ డెవలప్ మెంట్సు వాతావరణాన్ని కలుషితం చేస్తున్నట్లే- మెంటల్ పొల్యూషన్ వస్తుంది." అంది సావిత్రి. "క్షమించాలి. ఇది కేవలం నా అభిప్రాయం" అంది మళ్ళీ.

కరుణ నవ్వి "పోనీ-కనీసం మీ వారితో పరిశోధనల గురించేనా చర్చిస్తున్నారు. అదీ ఒకందుకు నయమే-" అంది.

సావిత్రి కూడా నవ్వి అన్ని విషయాలలో లాగే ఇదీ తనకు తెలిసిన సబ్జక్టు కాబట్టి భర్తకు సలహాల నిస్తున్నానని చెప్పి భర్త ఆ రోజు చేస్తానన్న ప్రయోగం గురించి చెప్పింది. "ఎందుకో. ఈ విషయంలో నా భర్త గొప్ప డిస్కవరీ చేస్తారని నాకు చాలా నమ్మకంగా ఉంది" అని కూడా అంది.

కరుణ నవ్వి "మీవా రదృష్టవంతులు. నాకు మావారి మీద అంత నమ్మకం లేదు" అంది.

"మీకు లేకపోతేం లెండి_మీరు కాదన్నా మీ వారి సామర్థ్యం చూసేవాళ్ళకు కనిపిస్తూనే ఉందిగా" అంది సావిత్రి.

కరుణ భర్తకు కారుంది. వాళ్ళ ఇల్లు సావిత్రి ఇంటికి పక్కనే ఉన్నా-చూడగానే గొప్ప వాళ్ళ ఇల్లని తెలిసి పోయేలాగుంటుంది. వాళ్ళింట్లో ఫర్నిచర్ ఖరీదైనదిమాత్రమే కాక ఎంతో అందమైనది, అద్భుతమైనది. ఇంట్లో ఎప్పుడూ ఇద్దరూ ముగ్గురు పని వాళ్ళుంటారు. కరుణకు అంతస్థు ఉన్నా గర్వం లేదు. ఆమె చాలా సింపుల్ గా ఉంటుంది. ఆమె స్నేహం సావిత్రి లాంటి వాళ్ళతోనే!

కరుణ వెళ్ళిన అరగంటకు శేఖరం ఇంటికి వచ్చాడు. వస్తూనే అతను సావిత్రి మీద తన ఉత్సాహాన్ని ప్రదర్శించాడు.

"ఏదో జరిగింది. లేకపోతే..." అంది సావిత్రి ఉత్సాహంగా.

"అవునోయ్_ఈ రోజు నేను చేసిన దొకటైతే సాధించినది మరొకటి" అంటూ సింపుల్ గా టూకీగా తన ప్రయోగం వివరాలా మెకు చెప్పాడు. సావిత్రి అంతావిని

ఆశ్చర్యంగా "అంతా బాగానే ఉంది కానీ ఆ రేడియే షన్‌కు మగవారి మీద కూడా ఏదైనా ప్రభావం చూపిం చగల శక్తి ఉందేమో చూడండి. లేకపోతే ఈ మధ్య కాలంలో మిమ్మల్నింత ఆవేశంగా చూడలేదు" అంది.

"ఈ రేడియేషన్ వేరు. అది నీ కళ్ళలోంచి వస్తుంది. అంతేకారణం" అన్నాడు శేఖరం. అతను ఉత్సాహంగా ఉన్నాడు.

శేఖరం దేశంకోసం ప్రాణాలు త్యాగం చేసేటంత దేశ భక్తుడు ఔనో కాదో తెలియదుకానీ దేశానికి ఉప కారం జరిగే పని తన వల్ల నవుతుందంటే ఆనందం పొందే టంత భక్తి మాత్రం అతనికుంది. తన ఈ ప్రయోగం ఫలిస్తే దేశం సస్యశ్యామలమై పోతుంది. పేదరికం మాడి పోతుంది. ఎక్కడ కావాలంటే అక్కడ ఎంత కావా లంటే అంత ఎప్పుడు కావాలంటే అప్పుడు వాన కురు స్తుంది. అతివృష్టిని నివారించలేకపోయినా అనావృష్టిని నివారించడానికి తన ప్రయోగం పనికి వస్తుంది.

శేఖరానికా రాత్రి నిద్రపట్టలేదు. మర్నాడు తను చేయదల్చుకున్న ప్రయోగాల గురించి ఆలోచిస్తూంటే అతనికి నిద్ర రావడం లేదు. సావిత్రి మాత్రం మధ్య మధ్యలో మెలకువ వచ్చినపుడల్లా-"ఇంకా మీకు నిద్ర పట్టలేదా" అంటూందేది. ఒక దేశపు భవిష్యత్తునే మార్చివేయగల ప్రయోగం గురించి ఆలోచిస్తూన్న శేఖ రానికి నిద్రపట్టక పోవడంలో ఆశ్చర్యం లేదు.

మర్నాడు సావిత్రి నిద్ర లేస్తూనే-"రాత్రి మీకు నిద్ర పట్టినట్లు లేదు. మీకూ నిద్రపట్టనప్పుడు నన్ను నిద్ర పోనివ్వడం ఇదే మొదటిసారి. ఆ రేడియేషన్లో ఏదో ఉంది బాబూ" అంది.

"అదే తేలుస్తాను" అన్నాడతను. అతను త్వరత్వరగా కాలకృత్యాలు తీర్చుకుని టిఫిన్ తిని ఆఫీసుకు బయలుదేరి వెళ్ళాడు. ఆఫీసులో శేఖరాన్ని బాస్ పిలిచి, "ఈ రోజు ఫీల్డులోకి వెళ్ళవద్దు. కొంత పేపర్ వర్కు చేయాలి" అన్నాడు.

తను నిన్న కనుగొన్న ప్రయోగ ఫలితాల గురించి చెప్పాలా కూడదో అనుకున్నాడు శేఖరం. వాటిని ధృవపర్చుకునే వరకూ బాస్‌కు చెప్పడం మంచిది కాదనిపించి ఊరుకున్నాడు శేఖరం. ఆ రోజు ఫీల్డులోకి వెళ్ళడానికి వీలుకానందుకు శేఖరానికి నిరుత్సాహం కలిగింది. కానీ ఏం చేసేది ఇండియాలో రీసెర్చి ఇంతే, సగానికి పైగా పేపర్ వర్కే!

మధ్యాహ్నం మూడున్నరకు శేఖరానికి ఫోన్ వచ్చింది. బహుశా ఇంటి దగ్గర్నుంచే అయ్యుంటుందనుకున్నాడు శేఖరం. కానీ ఫోన్‌లో ఎవరిదో పురుష వ్యక్తి కంఠం వినిపించింది.

"మాట్లాడేది శేఖరం గారేనా?"

"అవును–శేఖరాన్నే మాట్లాడుతున్నాను."

"కంగ్రాజ్యులేషన్స్ శేఖరంగారూ మీరింక ఉద్యోగం చేయనవసరం లేదు. అయినా లక్షాధికారయ్యేక ఉద్యోగం మీరెందుకు మాత్రం చేస్తారండి?" అన్నాడు అవతలి వ్యక్తి.

"హలో! మీరే శేఖరంతో మాట్లాడుతున్నారో తెలుసా?"

"తెలుసండీ? మీ లాబరేటరీలో శేఖరం పేరుగల సైంటిస్టు ఒక్కరేకదా ఉంట" అన్నాడు అవతలి

వ్యక్తి. "ఇంకా మేము పొరబడుతున్నామని మీ కను మానంగా ఉంటే మరికొన్ని వివరాలివ్వగలను. మీ భార్య పేరు సావిత్రి. చాలా?"

శేఖరానికి కొద్దిగా భయంవేసింది. "ఇంతకీ మీరు నా కెందుకు ఫోన్ చేశారో చెప్పగలరా?" అన్నాడు.

"నిన్న మీరు సాధించిన అద్భుత ఫలితముంది చూడండి. అదే వాతావరణంలోని మార్పు గురించి. ఆ సందర్భంలో మీతో మాట్లాడాలి."

"ఏం మాట్లాడుతారు?"

"ఇప్పుడు చెప్పను. ఇంటికి వెళ్ళండి. మీ భార్య చెబు తుంది!"

"నా భార్య మీ కెలా తెలుసు?" అడిగాడు శేఖరం. సమాధానంగా అవతల క్లిక్ మంది.

3

శేఖరానికి మనసు మనసులో లేదు. అతనాఫీసులో ఏ పనిమీదా దృష్టి నిలపలేకపోయాడు. తనకు ఫోన్ చేసిన దెవరు? నిన్న తను చేసిన ప్రయోగం గురించి అతని కెలా తెలిసింది?

ఎవరో తనింటికొచ్చి ఉండాలి. మాటల సందర్భంలో సావిత్రి అతనికి తన ప్రయోగం గురించి చెప్పి ఉండాలి. అతనికీ విషయంమీద బాగా ఆసక్తి ఉండి ఉండాలి. అందుకే వెంటనే తనకు ఫోన్ చేశాడు. అయితే ఫోన్ చేయడమెందుకు?

శేఖరం మనసులో ఇంకా ఒకటి రెండు ప్రశ్న లున్నాయి. తన భార్యదగ్గర చనువుగా మాట్లాడగలిగిన ఆ మగాడెవరు? అతనికి ఈ పరిశోధనమీద ఉత్సాహాల

మెందుకు? కుతూహలమున్నవాడు—తిన్నగా లాబరేటరీకి రావచ్చు. లేదా సాయంత్రం తనింటికి వచ్చేవరకూ ఎదురు చూడవచ్చు. ఈ రెండు కాకుండా ఫోన్ చేశాడంటే ఏదో రహస్యముండి ఉండాలి.

ఓ పావుగంట ముందుగానే శేఖరం ఇల్లు చేరాడు. అతను చేరే సమయానికిల్లు తాళం వేసి ఉంది. శేఖరం ఆశ్చర్యపడ్డాడు. అతనికి కొద్దిగా భయంకూడా వేసింది.

అతనింకా ఆలోచనలో ఉండగానే ఎవరో అతన్ని పిలిచారు. శేఖరం వెనక్కి తిరిగాడు.

“నా పేరు రాజయ్యండి. పక్కింట్లో నౌకర్నండి కరుణమ్మగారు మీకీ ఉత్తరమిమ్మన్నారండి. ఇది సావిత్రమ్మ బయటకు వెడుతూ మీకిమ్మని చెప్పి ఇచ్చారుటండి” అని ఓ కవరు శేఖరం చేతికిచ్చి వెళ్ళిపోయాడు.

శేఖరం కవరు చించి అందులోంచి ఉత్తరం పైకి తీశాడు.

“డియర్ శేఖరం—

ఈ కవరు నీచేతి కందగానే జాప్యం చేయకుండా రవీంద్ర కాలనీకి బయల్దేరు. అక్కడ సిటీబస్ స్టాపుదగ్గర చేతిలో ఆకుపచ్చ జేబురుమాలు పట్టుకున్నమనిషి దగ్గరకు వెళ్ళి నీ పేరు చెప్పు. అతను తీసుకువెళ్ళిన చోటికి వెళ్ళు. శుభమవుతుంది.

వెళ్ళకపోతే నీ భార్య ఏమవుతుందీ చెప్పడం అనవసరం. కానీ ప్రస్తుతం ఇంట్లో ఆమె లేదనీ—అందుక్కారణం మేమనీ గుర్తుంచుకో.

ఇందులో నీకుగానీ నీ భార్యకుగానీ ప్రమాదమేమీ లేదు. మా దగ్గరకు రాగానే ఇంత చిన్న విషయానికింత

డావుడి చేశామేమిటని ఆశ్చర్యపోతావు. నీకేమాత్రమూ
ం కాకుండా—అనుకోని అధిక లాభం కలిగించే
యోభిలాషులను నువ్వు కలుసుకోబోతున్నావని
రుంచుకుంటే చాలు మాకు.
ఉంటాము మరి—వస్తావు కదూ!

నీ శ్రేయోభిలాషి."

శేఖరం ఉత్తరాన్ని జేబులో పెట్టుకుని వెనక్కు తిరి
డు. ఏం జరిగిందో, ఏం జరగబోతోందో అతనికి అర్థం
క అయోమయంగా ఉంది. కానీ తన భార్య ఇంట్లో
వనీ ఆమె ఎవరో పరాయివారి చేతుల్లో పడిందనీ అత
తెలుస్తోంది.

అతను సిటీబస్ ఎక్కి రవీంద్ర కాలనీ వద్ద దిగాడు.
క్కడున్న ఒకతని చేతిలో పచ్చ జేబురుమాలుండడం
మనించి తిన్నగా అతని వద్దకు వెళ్ళి "నా పేరు శేఖరం"
న్నాడు. అతను నవ్వి "నాతోరండి" అన్నాడు.

శేఖరం కదిలాడు. ఇద్దరూ కలిసి సుమారు ఒక కిలో
ాటరు దూరం నడిచి ఒక ఇంటి దగ్గరకు వెళ్ళి ఆగారు.
"ఈ ఇంట్లోకే మనం వెళ్ళాలి" అన్నాడు పచ్చ
మాలతను. శేఖరం అతన్ననుసరించాడు.

ఇంటికి పీఠరుగులున్నాయి. ఒక అరుగు మీద చిన్న
ది ఉంది. ఆ గది తలుపులు తీసి ఉన్నాయి. శేఖరం ఆ
దిలోకే వెళ్ళాడు. ఆగదిలో మొత్తం నలుగురు కూర్చుని
ాడుతున్నారు. వారిలో ఒకడు శేఖరాన్ని చూసి
వ్వి "వచ్చేరా రండి కూర్చోండి" అన్నాడు.

అక్కడ ఒకేఒక కుర్చీవుంది. అది ఖాళీగావుంది.
ాడేవారంతా క్రింద కూర్చుని ఆడుతున్నారు.

శేఖరం సందేహిస్తూనే ఆ కుర్చీలో కూర్చున్నాడు.

శేఖరాన్ని పలకరించిన తను ఆట ఆపివేసి "ఫ్రెండ్స్ ఈ వేళ్టికిక ఆట లేదు మీరు వెళ్ళవచ్చు" అన్నాడు అతను. అందరికీ తలో వంద కాగితమూ ఇచ్చాడు. పచ్చరుమాలు వ్యక్తికికూడా వందరూపాయలు అందింది. అందరూ బయటకు వెళ్ళిపోయారు. శేఖరమూ అతనూ ఇద్దరే మిగిలారు. అతను గుమ్మందాకా వెళ్ళి తలుపులు వేసివచ్చి "నన్ను మీ శ్రేయోభిలాషిగా గుర్తుంచుకోండి" అన్నాడు.

"అలాగే కానీ మీ రెవరో నన్నెందుకు పిలిపించారో నా భార్య ఏమయిందో తెలుసుకోగోరుతున్నాను—" అన్నాడు శేఖరం.

"నేనెవరో మీకు చెప్పనవసరం లేదు. తెలుసుకుందుకూడా ప్రయత్నించకండి. ఈ ఇంటివారు ఈవీధిగదిని సుందరం అనే కుర్రాడికద్దెకిచ్చారు. నెలకి యాభైరూపాయలు అద్దెయిస్తున్నాడతను. ఒక్క రోజుకు వందరూపాయలు అద్దె యిచ్చాను నేను. ఈ రోజుకిది నాస్వంతమయింది. ఇందాకా నా దగ్గరున్నవారెవ్వరూ నాకు పరిచయస్థులు కారు. వందరూపాయలు చొప్పున యిచ్చి తాత్కాలికంగా వారి పరిచయాన్ని కొనుక్కున్నాను. నేనసలు ఈ ఊరివాణ్ణే కాను—ఇవన్నీ ఎందుకు చెబుతున్నానంటే ఉనికి యితరులకు తెలియకుండా నేను చాలా జాగ్రత్తపడుతున్నానని మీకు తెలియడంకోసం" అని ఆగేడతను. "ఇది మీ మొదటి సందేహానికి జవాబు—మీ మూడవ సందేహం మీ భార్య గురించి. ఆమె చాలా క్షేమంగావుంది. ఏమీ దిగులుపడనవసరంలేదు మీరామె గురించి—ఇకపోతే మీ రెండవ సందేహం..." అని ఆగేడతను.

శేఖరం అతనివంకే పరీక్షగా చూస్తున్నాడు. బాగా పరీక్షగా చూస్తే అతను మేకప్‌లో వున్నాడని అనుమానంగా ఉంది. అతనెవరై వుంటాడా—ఏం చెప్పదల్చుకుని వుంటాడా అని శేఖరం ఆలోచిస్తున్నాడు.

"మీకో సామెత తెలుసుననుకుంటాను. ఊరుకున్నంత ఉత్తమం లేదు—బోడిగుండంత సుఖం లేదు...అని. అది మీపట్ల నిజం కాబోతుంది. వాతావరణంలో మార్పులు తేగల ప్రయోగాలు చేయడం మీరు మానేయాలి. ఇంత వరకూ చేసిన ప్రయోగాల సంగతికూడా ఎవరికీ చెప్ప కూడదు..." అన్నాడతను.

శేఖరం ఆశ్చర్యంగా అతనివంక చూసి "ఈ ప్రయోగ మింకా నిన్ననే చేశాను. అప్పుడే మీదాకా ఎలాగ వచ్చింది?" అన్నాడు.

"దాన్ని బట్టయినా నా సామర్థ్యం అర్థం చేసుకోవాలి నాక్కావలసిన సమాచారం క్షణాలమీద తెలుసుకో గలను."

"బాగానేవుంది కానీ, ఈ ప్రయోగాలు నేను మానే యడ మెందుకు? దీనివల్ల పదిమందికి కూడు దొరుకుతుంది దేశం సుభిక్షమౌతుంది" శేఖరం ఏదో అనబోతూండగా అతను ఆపి—

"ఎందుకు అన్న ప్రశ్న నేను సహించను. నా ఆజ్ఞకు ఎదురుండకూడదు. చెప్పినట్లు వింటే అందుకు మంచి ప్రతి ఫలంకూడా వుంటుంది" అన్నాడతను.

"వినకపోతే..."

"ముందుగా సావిత్రి మరణిస్తుంది. అదీ మామూలు చావుకాదు. అమానుషంగా చెరచబడి—హత్య చేయబడు

తుంది'' అతను చాలా తాపీగా అన్నాడు కానీ శేఖరం మాత్రం వణికిపోయాడు. ఇంతవరకూ లేని కొత్త భయం అతనిలో ప్రవేశించగా ''అయితే యిప్పుడు నేనేం చేయాలి?'' అన్నాడు.

అతను శేఖరాన్ని చూసి నవ్వి ''వయసులోవున్న యువకులు మీరు. అందమైన భార్యను పొందగలిగిన అదృష్టవంతులు. హాయిగా జీవిత మాధుర్యం చవిచూడక ఎందుకు పరిశోధనలతో సమయాన్ని వృధాచేసుకుంటారు? వెంటనే ఉద్యోగానికి రాజీనామా యివ్వండి. మీ పరిశోధనల గురించీ సైంటిస్టు జీవితం గురించీ మర్చిపోండి. ప్రతిఫలంగా మానుంచి ఐదులక్షలరూపాయలు పొందండి'' అన్నాడు.

అతను చెప్పేదంతా అర్థంచేసుకునేందుకు శేఖరానికి కాస్త టైంపట్టింది. అర్థమయ్యాక ''మీరు చెప్పినట్లే వింటాను కానీ నేను సామాన్యుడిని. హఠాత్తుగా ఐదు లక్షల రూపాయలు నా దగ్గర చేరితే అంతా అనుమానిస్తారు గదా'' అన్నాడు.

అతను నవ్వి ''నేను మీ శ్రేయోభిలాషిని. మీకే యిబ్బందీ రానివ్వను. బహుమతి పొందిన లాటరీ టికెట్ మాదగ్గర సిద్ధంగా వుంది. అది మీకిస్తాను. అది మార్చుకుని డబ్బు తెచ్చుకున్నాక నే మీరుద్యోగానికి రాజీనామా ఈయవచ్చును. బహుమతి మొత్తం ఎనిమిది లక్షలు. టాక్స్‌పోగా ఐదులక్షలు పైగానే వస్తుంది'' అంటూ జేబులోంచి ఓ కాగితం తీసి అతనికిచ్చాడు. అది లాటరీ టికెట్టని శేఖరం గుర్తించాడు.

''ఇక మీరు వెళ్ళవచ్చు. ఇదిగో మీ ఇంటి తాళం.

దీనితో తలుపు తెరిచి... ప్రవేశపెడుతూ ప్రకారం ప్రవేశించండి. మీ భార్య క్షేమంగావున్నట్లు కొద్దిసేపట్లో నే తెలుసుకోగలరు'' ఇంటి తాళాన్నందుకున్నాడు శేఖరం. అతని మాటలకు జవాబివ్వకుండా అది జేబులో వేసుకుని అక్కణ్ణించి కదిలాడు.

''వెళ్ళేముందో విషయాన్ని గుర్తించుకోండి. నన్ను మళ్ళీ కలుసుకోవటం మీకు సాధ్యం కాదు. ఇక్కడికి వచ్చిమాత్రం ప్రయత్నించి భంగపడకండి. నేను చెప్పిన వన్నీ గుర్తుంచుకుని చెప్పినట్లు చేయండి. పొరపాటున కూడా మీరు చేసిన ప్రయోగ రహస్యం ఎవరికీ చెప్ప డానికి ప్రయత్నించకండి. ఆ విషయంలో పూర్తిగా మౌనంవహించకపోతే మీ ప్రాణాలకే ప్రమాదం. మిమ్మల్ని మామనుషులు వెయ్యికళ్ళతో కనిపెడుతుంటా రని గుర్తుంచుకోండి'' అన్నాడు అతను.

శేఖరం అక్కణ్ణించి కదిలి బస్‌స్టాపుకి వచ్చి బస్సెక్కి తన ప్రాంతం చేరాడు. అతను వెళ్ళేసరికింకా వీధితలుపు తాళం వేసేవుంది. నిరుత్సాహంగా నిట్టూర్చి తలుపు తాళం తీసి లోపల ప్రవేశించాడతను. జరిగినదంతా నిజమే నని అతనింకా నమ్మలేకపోతున్నాడు.

లైటువేసి వీధితలుపులు వేశాడు. అతనికి నీరసంగా వుంది. సావిత్రి ఏమయిందో ఎప్పుడొస్తుందో అనుకుంటూ పడకగదిలోకి వెళ్ళాడు. అక్కడ గదిలో మంచం మీద పడుకునివున్న సావిత్రిని చూసి అతనాశ్చర్యపోయాడు. ఆమెకు కాళ్ళూ చేతులూ కట్టబడివున్నాయి. నోట్లోగుడ్డలు కుక్కబడ్డాయి.

శేఖరం వెంటనే ఆమెకు కట్లువిప్పి నోట్లోగుడ్డలు

తీసేసి జరిగినదామె నోట విని తెలుసుకున్నాడు.

మధ్యాహ్నం ఎవరో వచ్చి ఇంటి తలుపులు తట్టారుట. తను తలుపుతీయగానే లోపలకు ప్రవేశించి ఒక కవరు నామెకిచ్చి దొడ్డి తలుపు దగ్గరగా వేసివుంచి బయటకు రమ్మన్నాడట. ఇంటితాళం సావిత్రే స్వయంగా వేసిందట. కవరు కరుణకు ఆమే ఇచ్చివచ్చిందట. ఆ తర్వాత యిద్దరూ కలిసి ఒక సందుతిరిగి మళ్ళీ దొడ్డిదారిన ఇంట్లో ప్రవేశించారట. వాడు సావిత్రినిలా బంధించి వెళ్ళిపోయాడట. చెప్పినట్లు వినకపోతే శేఖరం ప్రాణాలకు ప్రమాదమని వాడు బాగా నొక్కి చెప్పడంవల్ల సావిత్రి వాడు చెప్పినట్లు విన్నదట.

శేఖరం సావిత్రిని ఓదార్చి తనకు జరిగినదికూడా చెప్పి "సావిత్రీ నా పరిశోధనలకు సంబంధించిన వార్త నీమూలంగానే బయటకు వెళ్ళివుండాలి. నువుగానీ ఎవరికైనా చెప్పేవా" అనడిగేడు.

"నేను కరుణకు మాత్రం చెప్పాను. కానీ మీరా ప్రయోగాలు చేస్తున్నప్పుడింకెవరూ మీదగ్గర లేరా?" అంది సావిత్రి.

"అదీ నిజమే—కానీ వాళ్ళు బొత్తిగా అటెండెంట్సు. నా ప్రయోగాలనర్థంచేసుకునే తెలివి తేటలున్నాయని అనుకోను" అన్నాడు శేఖరం.

"మీ ప్రయోగాలంటే కరుణకి బాగా ఆసక్తివుంది. నిన్న మీరు మొదలుపెట్టబోతున్న ప్రయోగఫలితం తెలుసుకునేందుకీరోజు ఉదయం మీరు వెళ్ళగానే వచ్చేసింది" అంది సావిత్రి.

శేఖరం సాలోచనగా "కరుణ ఎలాంటి మనిషి?" అన్నాడు.

"చాలాసరదా అయినది. మంచిమనిషి..." అంది సావిత్రి.

4

"ఎవరు మీరు!" అన్నాడు శేఖరం.

"నేనెవరైతే మీకెందుకు లెండి—మీరిప్పుడుద్యోగం రాజీనామా చేయడానికికదా వెడతూంట. ఆ సమయంలో మీరు ఆఫీసులో ఇంకే విధమైన విషయాలూ చెప్పలేదని ధృవపర్చుకోడానికి మీకూడ వస్తున్నాను. మీరు మాట తప్పిన మరుక్షణం ఇంటివద్ద మీభార్య..." అతను ఆగి "మీకు తెలిసినదే కదా! నన్నేమైనా చేయడానికి ప్రయత్నిస్తే—నాగురించి ఏమీ తెలుసుకోలేరు కానీ మీజీవితాన్ని నాశనం చేసుకున్నవారౌతారు" అన్నాడు.

శేఖరం ఆశ్చర్యపోయాడు. ఏదో ముఠా తనవెంట పడింది. అనుక్షణం తనను వెన్నాడుతోంది. తన ప్రతి చర్యనూ కూలంకషంగా పరిశీలిస్తోంది.

రవీంద్రకాలనీ నుంచి తిరిగివచ్చేక తను సెలవు పెట్టాలనుకుని మర్నాడాఫీసు దగ్గర్లోనున్న టెలిఫోన్ బూత్ దగ్గరకు వెడితే అక్కడ ఒకతను పలకరించి తను ఫోన్ చేయనవసరంలేదనీ అతనే ఫోన్ చేసి విషయం చెబుతాననీ అన్నాడు. ఆ తర్వాత సావిత్రి పుట్టింటికి ఉత్తరం రాస్తే అది తను పోస్టు చేయబోగా ఒకతను వచ్చి అందులో యితర విషయాలేమీ లేవని ధృవపర్చుకున్నాకనే అది పోస్టయింది.

తన యింటికి ఏ సమయంలో ఎరిగున్నవాళ్ళొచ్చినా ఏదో వంకతో ఒక అపరిచితవ్యక్తి తన యింట్లోకి ప్రవేశిస్తున్నాడు. అతన్ని తను వారించలేదు.

శేఖరం జీవితం జీవితంలాకాక జైలులా తయారయింది. కానీ లాటరీ టికెట్టు అతన్ని లక్షాధికారిని చేసింది. బాగా ఆలోచించి భార్యాభర్తలిద్దరూ ఎన్నో చర్చలు జరిపి చివరకుద్యోగానికి రాజీనామా యివ్వాలని నిశ్చయించుకున్నారు. ఆ నిర్ణయాన్నమల్లో పెడదామని శేఖరం బయల్దేరేసరికి మళ్ళీ మరోమనిషి తయారు.

శేఖరం నిరభ్యంతరంగా ఆ వ్యక్తిని తనతో రానిచ్చాడు. అన్నిపనులూ సక్రమంగా పూర్తిచేశాడు. అతని బాస్ ఆశ్చర్యపోయి "ఎందుకీ రాజీనామా? నీకేం కష్టం కలిగింది?" అన్నాడు.

"అనుకోకుండా డబ్బు వచ్చింది. లైఫెంజాయ్‌చేద్దామనుకుంటున్నాను" అన్నాడు శేఖరం.

"నీలాంటి యువకుడు, అందులోనూ మంచి టాలెంట్ ఉన్నవాడు డబ్బు సరదాలకు లొంగిపోయి—దేశసేవ మానివేయడం నాకు నచ్చలేదు—" అన్నాడు శేఖరం బాస్.

"ఏం దేశసేవలెండి. దేశంలో చాలామంది నిరుద్యోగులున్నారు. ఈ విధంగా మరో యువకుడికవకాశమిచ్చినట్లుంటుంది" అని అక్కణ్ణించి వచ్చేశాడు శేఖరం. అతన్ననుసరించి వచ్చినతను శేఖరాన్ని ఇంటిదగ్గర దిగబెట్టి మరీ వెళ్లాడు.

రాజీనామా ఇచ్చేక శేఖరానికి ఉత్సాహంగా లేదు. "సావిత్రీ పరిశోధన చేయాలన్నది నా ఆసక్తి. అది చంపుకున్నాను. డబ్బు బాగానే వుందిప్పుడు మనకు. కానీ జైలుజీవితంలా మారిపోయింది మనబ్రతుకు. ఎక్కడికెళ్ళినా ఎవడో ఒకడు మనవెంటపడుతున్నాడు. వాడి బారినుంచి

తప్పించుకోవడమెలాగో తెలియడంలేదు. ఒక రహస్యం దాచడంకోసం జీవితంలోని అన్ని రహస్యాలూ బయట పెట్టుకు బ్రతకాల్సొచ్చింది."

సావిత్రి అతన్ని ఓదార్చి "ఎందుకు బాధపడతారు? మనకు డబ్బుంది హాయిగా జీవిద్దాం. వాళ్ళెవరో ఎన్నాళ్ళు ఓపికగా మనవెంట పడతారో పరీక్షిద్దాం" అంది.

"వాళ్ళ ఓపిక కంతుందో లేదో నాకు తెలియదు కానీ నాఓర్పు మాత్రం నశించింది. ఎలాగో అలా వీళ్ళ బారి నుండి తప్పించుకోవాలి" అన్నాడు శేఖరం.

"ఎందుకండీ వాళ్ళు చెప్పినట్లు ఊరుకుంటే పోయే దానికి అనవసరం రభస చేస్తారు. పాత జీవితం గురించి మరిచిపోయి మామూలు జీవితం గడిపినన్నాళ్ళూ మనకే బాధ లేదుకదా" అంది సావిత్రి.

శేఖరం వినలేదు అతనికి చాలా బాధగావుంది. కొంత సేపు ఆలోచించి "ఒక్కటే ఉపాయంతోస్తోంది నాకు. ప్రస్తుతానికి నాకు మతి భ్రమించిందనుకో, సైకాలజిస్టు దగ్గరకు తీసుకువెళ్ళు" అన్నాడు.

"ఈ విషయంలో మనం ఊరుకుంటేనే ఉత్తమం. అనవసరపు ప్లాన్సువేసి ప్రాణాలమీదకు తెచ్చుకోవడం నాకిష్టంలేదు" అంది సావిత్రి. శేఖరం ఏమీ మాట్లాడ లేదు.

5

"కరుణా మీకెవరైనా మంచి సైకాలజిస్టు తెలుసా?" అనడిగింది సావిత్రి.

"తెలుసు కానీ ఎందుకు?" అనడిగింది కరుణ.

"ఆయన ఏమిటో పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారు. నాకెందుకో భయంగావుంది. మధ్యమధ్యలో తెలివిగానే

మసలుతున్నారు. కానీ ఉండుండి పిచ్చిమాటలు చెబుతున్నారు. మాకు లాటరీలో డబ్బొచ్చిందని నేను బలవంత పెట్టి ఆయనచేత ఉద్యోగం మానిపించాను. ఉద్యోగం మానడం ఆయనకంత యిష్టంకాని మాట అటుంచి పరిశోధన ఆయనప్రాణం. అందువల్ల ఏమైనా మనసు చెదిరిందేమోనని భయంగావుంది. ఎవరైనా మంచి సైకాలజిస్టు మీకు తెలిసినవాళ్ళుంటే...”

“గోవిందరావని మాకు తెలిసినాయనే ఒకడున్నాడు. ఆయనకేవో ఫారిన్ డిగ్రీలుకూడా ఉన్నాయనుకుంటాను. వెళ్ళి మీ అదృష్టం పరిశీలించుకోండి” అంటూ అడ్రెస్ చెప్పి తన సానుభూతికూడా ప్రకటించింది కరుణ.

కరుణ యిచ్చిన అడ్రెస్ తీసుకుని భర్త దగ్గరకెళ్ళింది సావిత్రి.

“జాగ్రత్త కోటు సరిగా వేసుకున్నావా బొత్తాలన్నీ పెట్టుకున్నావా అసలే రేడియేషన్ ఎక్స్‌పర్‌మెంట్సు” అన్నాడు శేఖరం.

“సరేనండి నటన బాగానేవుంది కానీ మనమింకా సైకాలాజిస్టుదాకా వెళ్ళలేదు. ఇంట్లోనేవున్నాం” అంది సావిత్రి.

“కొన్నికొన్ని సమయాల్లో కాస్త ముందుగానే మొదలు పెడుతుండాలి సావిత్రీ” అన్నాడు శేఖరం. “అప్పుడే నీముఖంలోకూడా కాస్త ఆదుర్దాలూ అవీ కనబడతాయి.”

శేఖరం నటన ప్రారంభమైంది. సావిత్రి అతన్ని మంచి మాటలాడుతున్నట్లు నటిస్తూ బయటకు తీసుకువచ్చి ఇంటి తలుపు వేసింది. వాళ్ళిద్దరూ రోడ్డుమీదకు వచ్చి నాలుగడుగులు వేశారోలేదో ఒక టాక్సీ వాళ్ళపక్కగా పోతూ

ఆగింది. సావిత్రి రెండడుగులు ముందుకు వేసి గోవిందరావు అడ్రసున్న కాగితం అతనికి చూపించింది. టాక్సీవాలా తలూపి "ఎక్కండి" అన్నాడు.

సావిత్రి, శేఖరం ఇద్దరూ టాక్సీ వెనకసీట్లో ఎక్కారు. టాక్సీ శరవేగంతో బయల్దేరింది. ఒక పది నిమిషాలు గడిచేక టాక్సీ సరైన దోవలో వెళ్ళడం లేదని సావిత్రికి అనుమానం వచ్చింది. తన అనుమానాన్ని గట్టిగానే బయటపెట్టిందామె.

"కంగారేం లేదమ్మా. ఆ గోవిందరావుగారు నాకు బాగా తెలుసు. ఆయనిప్పుడు ఇల్లు మారారు. వారింటికే మనం వెడుతున్నాం" అన్నాడు టాక్సీవాలా తాపీగా.

శేఖరం తాత్కాలికంగా నటన మానేశాడు. సావిత్రి, అతనూ కలిసి భయం భయంగా ఏవో గుసగుసలాడుకున్నారు. మరో అయిదు నిముషాల్లో టాక్సీ ఒక ఇంటి ముందాగింది. "ఇదేనమ్మా గోవిందరావుగారిల్లు" అన్నాడు టాక్సీవాలా.

ముందుగా సావిత్రి, తర్వాత శేఖరం టాక్సీ దిగారు. సావిత్రి టాక్సీ ఫేర్ చెల్లించింది. సావిత్రి తర్వాత ఇంటి వైపు నడిచి తలుపు తట్టింది.

సుమారు రెండు నిముషాలకు తలుపు తెరుచుకుంది. ఒక ముసిలాయన బయటకు తొంగిచూసి "ఇది సైకాలజిస్టు గోవిందరావు ఇల్లు. ఇల్లు మారేక ఇంకా నేమ్ ప్లేట్ బయటపెట్టలేదు. మీరు వచ్చింది ఆయనకోసమే అయితే లోపలకు రావచ్చు" అన్నాడు.

సావిత్రి, శేఖరం లోపల ప్రవేశించేక ఆయనే సైకాలజిస్టు గోవిందరావు అని అర్థం చేసుకున్నారు.

"పిచ్చి ఎవరికి?" అన్నాడు గోవిందరావు ఇద్దర్నీ పరిశీలించి చూస్తూ.

"మా ఆవిడకండి" అన్నాడు శేఖరం తాపీగా. సావిత్రి కలగజేసుకుని తను కరుణకు చెప్పిన విధంగానే గోవిందరావుకు చెప్పింది. గోవిందరావు సాలోచనగా తల పంకించి "నువ్వేం చెబుతావ్?" అన్నాడు శేఖరాన్ని పరీక్షించి చూస్తూ.

శేఖరం వెకిలిగా నవ్వాడు.

"సరేలే—నువ్వేం చెప్పక్కర్లేదులే" అన్నాడు గోవిందరావు అర్థమైనట్లు. తర్వాత ఆయన సావిత్రివైపు చూసి "ఇలాంటి కేసులు నాకొకటి రెండు ఇదివరలో కూడా వచ్చాయి. ఇది కుదర్చడానికో సులభమైన పద్ధతి ఉంది" అంటూ లోపలకు వెళ్ళి ఒక ఫోటో ఆల్బం తీసుకు వచ్చాడు.

"చూడు బాబూ! నీ పేరు శేఖరం అన్నావు కదూ! నువ్వు అనవసరంగా బాధపడుతున్నావు. ఉద్యోగం మానేసి హాయిగా ఇంట్లో కూర్చోవడంవల్ల ఎన్నో సుఖాలున్నాయి. ఈ ఆల్బం చూడు. ఆఫీసుకు వెళ్ళే మగవాళ్ళ ఇళ్ళలో ఒంటరిగా ఉండే ఆడవాళ్ళ ఇబ్బందులు నీకు తెలుస్తాయి" అంటూ ఆయన శేఖరానికి ఆల్బం అందించాడు.

శేఖరం ఆల్బం అందుకుని చూసి ఉలికిపడ్డాడు. అందులో ఒక మానభంగం కేసుకు సంబంధించిన ఫోటోలు క్లోజప్‌లో ఉన్నాయి. ఫోటోలో ఆమె ఎవరో అతనికి తెలియలేదు. కానీ అత్యాచారం మాత్రం దారుణంగా ఫోటోలోకి వచ్చింది.

శేఖరం తలెత్తి గోవిందరావువంక చూశాడు. గోవింద రావు కళ్ళలోంచి నిప్పులు కురుస్తున్నాయి. బాగా పరీక్షిస్తే ఆ కళ్లు తనకు పరిచయమైనవేననీ రవీంద్ర కాలనీలో తనను బెదిరించి లాటరీ టికెట్ ఇచ్చిన వ్యక్తి అతనేననీ గ్రహించాడు శేఖరం.

"మిస్టర్ శేఖరం! ఇది నీకు లాస్టు వార్నింగ్. ఈ ఫొటోలో ఆమె ఎవరో తెలుసా? నా లాస్ట్ వార్నింగు లక్ష్యపెట్టని ఒక తెలివితక్కువవాడి భార్య. నీ భార్య కూడా అదే గతి పట్టించకు..." అన్నాడు గోవింద రావు తీవ్రంగా.

శేఖరం తల తిరిగిపోయి "ఏమిటి మీరనేది?" అన్నాడు.

సావిత్రి మారు మాట్లాడకుండా "రండి పోదాం" అంది.

ఇంటికి వెళ్లేదాకా ఇద్దరూ మౌనంగా ఉన్నారు. ఇంటికి వెళ్ళేదాక "వీడెవడో దివ్యదృష్టి ఉన్నవాడిలా గున్నాడు" అంది సావిత్రి.

"ఏ దివ్యదృష్టీ లేదు. మీ కరుణకీ ముఠాతో సంబంధ ముంది" అన్నాడు శేఖరం నమ్మకంగా.

"ఎందుకలాగనుకుంటున్నారు? గోవిందరావు అడ్రసు ఆవిడే యిచ్చింది కానీ మనని మోసం చేసింది టాక్సీ వాడేమో? వాడేకదా తనకు తెలుసునని చెప్పి మరీ ఆ యింటికి తీసుకువెళ్ళాడు!" అంది సావిత్రి.

"అది సరే ఆ టాక్సీవాడికి ముందుగానే మనం గోవింద రావు దగ్గరికి వెడుతున్నామని తెలుసుండాలి. అవతల నకిలీ గోవిందరావుకూడా మనకోసం సిద్ధంగావున్నాడు. వీళ్ళిద్దరికీ ఎవరో సమాచారమందించివుండాలి. మనం

యిలా బయల్దేరుతున్న సంగతి తెలిసిన ఏకైక వ్యక్తి కరుణ!'' అన్నాడు శేఖరం.

''మీరంటుంటే నాకూ నిజంలాగేవుంది. ఇప్పుడేం చేస్తాం?'' అంది సావిత్రి.

''వెధవదేశం మనది. మనుషుల కీమాత్రం రక్షణలేని ఈదేశమెందుకు? దేశాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్నామని చెప్పుకునే నాయకులెందుకు?'' అన్నాడు శేఖరం కసిగా.

6

శేఖరం తలుపుతీశాడు. ఎదురుగా శాస్త్రి నవ్వుతూ నిలబడివున్నాడు. శాస్త్రి లేబరేటరీలో అతని కొలీగ్. ఉద్యోగం మానేశాక అతను వీళ్ళింటికి రావడం యిదే ప్రథమం.

''రండి రండి'' అన్నాడు. శాస్త్రి లోపలకువచ్చాడో, లేదో ఒక మనిషీ లోపలకు వచ్చాడు. ''గ్యాస్ స్టవ్ రిపేరు చేయడానికి వచ్చానండి'' అన్నాడు. అతనెవరో తెలుసు కాబట్టి శేఖరం మాట్లాడలేదు. ఇటీవల యిది నిత్యానుభవమే కదా!

లాబరేటరీకి ప్రధానమంత్రి వస్తున్నాడట. ఆయనతో పాటు యిద్దరు విదేశీయ శాస్త్రజ్ఞులు వస్తున్నారుట. లాబరేటరీకి సంబంధించిన కొన్ని ముఖ్యవిశేషాలను వాళ్ళకు చూపిస్తారుట. ఆ సమయంలో శేఖరం అక్కడుంటే బాగుంటుందని లాబరేటరీ డైరెక్టరు అభిప్రాయపడ్డాడట.

శేఖరం క్షణం ఆలోచించి ''తప్పకుండా వస్తాను కానీ ప్రధానమంత్రిని చూసే అవకాశం అందులోనూ దగ్గ

ర్నుంచి మానే అవకాశం ఏ ఒక్కరికో కానీ రాదు. అహ్వానితుల్లో నా భార్యకూడా ఉండేలా చూడండి'' అన్నాడు.

''తప్పకుండా'' అన్నాడు శాస్త్రి. వాళ్ళిచ్చిన కాఫీ సత్కారాన్నందుకుని అతను వెళ్ళిపోయాక గ్యాస్ స్టవ్ రిపేరతను వచ్చి ''తప్పకుండా వెళ్ళండి. అక్కడికి నేనూ వస్తాను'' అన్నాడు.

''ఎవరూ నాతో రానవసరంలేదు. ఇన్ని పర్యాయాలు చెప్పించుకునే మనస్తత్వం కాదు నాది—'' అన్నాడు శేఖరం.

''మా జాగ్రత్తలో మేముండాలి కదా'' అని వెళ్ళి పోయాడతను.

శేఖరం ఆలోచనలో పడిపోయాడు. ప్రధానమంత్రి సందర్శనమంటే మాటలు కాదు. సెక్యూరిటీ ఏర్పాట్లు దట్టంగా, దిట్టంగావుంటాయి. కూడా ఆయుధం తీసుకువెళ్ళే అవకాశంకూడా వుండదు. అందరికీ అక్కడికి వెళ్ళే అవకాశం కూడా లభించదు. అటువంటప్పుడు ఈ ముఠా వాళ్ళు అక్కడికెలా వస్తారు? వచ్చినా తన హద్దుల్లో తన నెలాగుంచుతారు? తన భార్యనేదైనా చేస్తారేమోనని ఆమెనుకూడా తీసుకువెళ్ళడానికి నిశ్చయించుకున్నాడు.

'సరే—ఏం జరుగుతుందో చూద్దాం!' అనుకున్నా డతను.

ఒక రోజు ముందుగా శేఖరానికి ప్రధానమంత్రి సందర్శనం సందర్భంలో లాబరేటరీకి రావడానికి అవసర మైన బాడ్జెస్, ఐడెంటిఫికేషన్ కార్డ్సు వగైరాలు అందాయి. ఆరోజు రాత్రే శేఖరం దంపతుల నొకవ్యక్తి

కలుసుకుని బెదిరించి కొన్ని కాగితాలు వ్రాయించేడు. దేశద్రోహాన్ని తలపెడుతూ ఏదో ముఠాకు శేఖరం వ్రాసిన ఉత్తరాలవి.

ఆ పనయ్యేక ఆవ్యక్తి పోతూ "రేపు మీరు ఇల్లు వదిలేక లక్షరూపాయలు అన్నీ దొంగనోట్లు పెట్టబడ తాయి. ఈ ఉత్తరాలకు మా జవాబులు కూడా మీ ఇంట్లో వుంటాయి. ఈ ఉత్తరాలూ, ఒక ఫోన్ కాలూ పోలీసు లకు అందుతాయి. దంపతులిద్దరూ చక్కగా ప్రధాన మంత్రిని సందర్శించుకుని వస్తే ఏ ఇబ్బందీ లేదు. లేకపోతే మాత్రం...జీవితాంతం జైల్లోపడి మ్రగ్గాలి" అన్నాడు.

అతను వెళ్ళిపోయేక శేఖరానికి కళ్ళనీళ్ళు వచ్చేశాయి. సావిత్రి ఒడిలో తలపెట్టుకుని "ఎలాంటి జీవితం గడపా ల్సొచ్చింది!" అంటూ చిన్నపిల్లాడిలా ఏడ్చేశాడు.

7

"మన గురించి ప్రధానమంత్రి తమ అమూల్యమైన కాలాన్ని వినియోగించడానికి రావడం మనందరకూ ఎన్నో రకాలుగా లాభిస్తుంది. ఆయన్ని దగ్గర్నుంచి చూసిన ఆనందం, ఆయన మాటలు దగ్గర్నుంచి వింటూ ఆయన సందేశాన్ని పొందగలిగిన అదృష్టం, ఆయన సమక్షం కలిగించిన ప్రోత్సాహం—ఇలా ఎన్నో వున్నాయి" డైరక్టరుగారు ప్రధానమంత్రిని పొగుడుతూ ఉపన్యసించడ మయ్యేక ప్రధానమంత్రి లేచారు.

దేశాభ్యున్నతికి తనెలా పాటుపడిందీ, తన పార్టీ దేశా నికి ఎలా సేవ చేస్తున్నదీ క్లుప్తంగా వివరించి ఈ చిన్న లాబరేటరీలోని పెద్దపెద్ద ప్రాజెక్టులు, వాటి ఫలితాలు తననెలా కదిలించినదీ చెబుతున్నాడాయన.

శేఖరం ప్రధానమంత్రి మాటలు వినడంలేదు. అతను చుట్టూ చూస్తున్నాడు. ప్రధానమంత్రి గురించి చాలా దిట్టమైన ఏర్పాట్లు జరిగాయి. తమ మధ్య కూర్చున్న వారిలో కొందరు సివిల్ డ్రస్‌లోవున్న పోలీసువారు.

శేఖరం తన ప్రక్కనే కూర్చున్న సావిత్రి చేయి గిల్లాడు. ఆమె శరీరం వణికింది. తాము చేయబోయేపని తల్చుకుంటే ఆమె హృదయం దడదడలాడింది. బహుశా జీవితంలో ఇవి ఆఖరి క్షణాలయుండవచ్చుననుకుందామె.

శేఖరం మళ్ళీ సావిత్రి చేయిగిల్లాడు. ఇద్దరూ మెరుపు వేగంతో తమ కుర్చీలోంచి లేచి డయాస్ మీదకు వెళ్ళారు.

"అసమర్థులు బ్రతకూడదు. ప్రధాన మంత్రిని చంపేస్తాం" అన్నారిద్దరూ ఏక కంఠంతో. వారిద్దరూ ప్రధానమంత్రిని సమీపించకుండానే యిద్దరు సెక్యూరిటీ గార్డ్సు వాళ్ళని పట్టుకున్నారు. శేఖరం, సావిత్రి ఇద్దరూ ప్రధానమంత్రిని యిష్టంవచ్చినట్లు తిడుతున్నారు.

హఠాత్తుగా అక్కడి వాతావరణం మారిపోయింది. ఊహించని ఈ పరిణామానికి అంతా తెల్లబోయారు. మీటింగ్ అర్థాంతరంగా ముగిసింది. శేఖరం, సావిత్రిలను స్పెషల్ కస్టడీలోకి తీసుకోవడం జరిగింది.

లాబరేటరీ డైరెక్టరు "ఛా—కొరివితో తల గోక్కున్నట్లయింది. సదభిప్రాయంతో లాబరేటరీ ఉద్యోగి కాకపోయినా ప్రత్యేకంగా ఆహ్వానించాము. ఈ విధంగా మనమూ చిక్కుల్లో పడ్డాం"—అన్నాడు డిప్యూటీ డైరెక్టరుతో.

క్షణాలమీద పోలీసులు శేఖరం యింటిమీద దాడి

చేశారు. అక్కడ వారికి దొంగనోట్లూ, శేఖరం దేశ ద్రోహి అని ఋజువుచేసే కాగితాలూ దొరికాయి. ఒక రోజులో ఈ వార్త అన్ని వార్తాపత్రికలలో ప్రకటించ బడింది.

శేఖరం, సావిత్రీల ఫోటోలు వాళ్ళ జీవితవివరాలు చాలా పేపర్లలో వచ్చేశాయి. ఈ విధంగా దేశం మొత్తం ఈ అనామకుల గురించి తెలుసుకుంది. తన ప్రయోగంతో పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోవలసిన శేఖరం ఈ విధంగా అవి సంపాదించాడు.

ప్రస్తుతం శేఖరం, సావిత్రిలమీద రహస్య విచారణ జరుగుతోంది. వాళ్లెక్కడున్నారో, ఏమి చేస్తున్నారో వివరాలెవ్వరికీ తెలియవు.

8

డాక్టర్ స్వామి అదే లాబరేటరీలో శేఖరం స్థానంలో ఉద్యోగంలో చేరాడు. అతనింకా బ్రహ్మచారిగానే వున్నాడు. వయస్సు పాతిక దాటివుండవచ్చు, అతనికి శేఖరం వుండే ఇల్లు అద్దెకు దొరకడం మరో విశేషం.

ఒకరోజు రాత్రి ఎనిమిది గంటల సమయంలో ఎవరో ఇంటి తలుపు తట్టగా స్వామి తలుపు తీశాడు. అందమైన అమ్మాయక్కడుండడం చూసి ఆశ్చర్యపడ్డాడు.

"నా పేరు కరుణ" అందామె.

"నా పేరు స్వామి" అన్నాడు స్వామి.

"మీగురించి నాకన్నీ తెలుసు" అంది కరుణ. "లోప లకు రావచ్చా."

"రండి రండి" అన్నాడు స్వామి కంగారుగా.

కరుణ లోపలకు వచ్చి కూర్చుని తన గురించిన వివరాలు

చెప్పి "మావారెప్పుడూ ఇంటిపట్టున వుండరు. ఇదివరకు శేఖరం దంపతులు వుండేవారు. నా కాలక్షేపం రోజల్లా ఆవిడతో జరిగేది" అంది.

"అలాగా" అన్నాడు స్వామి ఏ విధమైన కుతూహలం చూపకుండా.

"నాకు శాస్త్రజ్ఞులన్నా వారి పరిశోధనలన్నా చచ్చేటంత యిష్టం. అందుకే శేఖరందంపతులతో స్నేహం చేసేదాన్ని" అంది కరుణ.

స్వామి మాట్లాడలేదు. అతనిది శాస్త్ర రిజర్వ్‌డ్ నేచర్ అని గ్రహించిన కరుణ టాపిక్ మార్చింది.

"బ్రహ్మచారయినా మీరింటిపట్టునే వున్నారు. పెళ్లి వయసులో వున్న పెళ్ళైముండీ ఆయన బయట కాలక్షేపం చేస్తున్నారు. చూడండి లేడా" అంది కరుణ.

స్వామి క్షణకాలం ఆమె కళ్ళలోకి చూసి తలదించుకుని "చూడండి మీరేమీ అనుకోనంటే ఒక విషయం చెబుతాను. సెక్స్ నా బలహీనత. ఒంటరిగానే కాదు పదిమందిలో వున్నప్పుడుకూడా ఆడది కనిపిస్తే నేను నిగ్రహించుకోలేను. అందుకే నేను సాధ్యమైనంతవరకూ ఆడవాళ్ళను దూరంగా—వాళ్ళను తప్పించుకుంటూ మసలుతాను. స్నేహంగా పలకరించటానికి వచ్చినా ఈ సమయంలో రావడంవల్ల నన్ను గురించి నేను చెప్పవలసి వాల్చింది" అన్నాడు.

కరుణ కళ్ళు మెరిసాయి. "మీరు బలహీనత అనుకుంటున్నది నాకు అవసరం. ఈ సమయంలో మీ ఇంటికి రావడంలో నా ఉద్దేశ్యాన్నిపాటికి గ్రహించేవుండాలి మీరు" అంది.

స్వామి లేచి వీధి తలుపులు వేశాడు. వచ్చి కరుణ చేయి పట్టుకుని మేడమీదకు దారి తీశాడు. కరుణ అతన్ననుసరించింది. ఇద్దరూ పడకగదిలోకి వెళ్ళారు.

పదినిమిషాలు గడిచేక—"ఐ లవ్ యూ..." అంది కరుణ.

"చూడు కరుణా యిప్పుడు నీకేం కావాలో అడుగు. ఇలా పడుకుని కబుర్లు చెప్పమంటే ఎన్నయినా ఎంత సేపయినా చెప్పగలను నేను" అన్నాడు స్వామి.

"నాకేమీ అక్కర్లేదు. నువ్వే కావాలి—" అంది కరుణ.

"పరిశోధనలంటే ఆసక్తి వుందన్నావు—" అన్నాడు స్వామి.

"అవుననుకో కానీ ఆ కబుర్లు ఇలాంటి చనువున్న వారి దగ్గర చెప్పుకోనవసరం లేదు" అంది కరుణ.

ఆమె నెమ్మదిగా తన బాధ చెప్పుకుంది. భర్త తన్ను నిర్లక్ష్యం చేస్తున్న కారణంగా మగతోడుకోసం ఆమె తపించిపోతోంది. సావిత్రితో పరిచయాన్ని శేఖరాన్ని దృష్టిలో వుంచుకుని పెంచుకుంది. కానీ శేఖరం ఈమె ఉనికినే గమనించలేదు. స్వామి ఆమెకు దేవుడిచ్చిన వరం లాగ వచ్చేడు.

"శేఖరం చాలా గొప్ప సైంటిస్టు" అన్నాడు స్వామి హఠాత్తుగా. "అతని దృష్టంతా సైన్సుమీదనూ పరిశోధనల మీదనూ వుంటుంది. భార్య ప్రోత్సాహం మీద ఉద్యోగం మానేశాక అతనికి మతి చలించినట్లుంది."

"శేఖరం గొప్ప సైంటిస్టని ఎందుకనుకుంటున్నావ్" అంది కరుణ.

"లాబరేటరీలో అతని పోస్టులోనే నేను చేరాను. అతని ప్రయోగాల వివరాలన్నీ చూశాను. అతను ప్రయోగాలు చేసేపద్ధతి ఫలితాలతను అర్థం చేసుకునే పద్ధతి వాటినిబట్టి అతను వేసే కొత్త పథకాలు అన్నీ అతని ప్రత్యేకతలు. నా ప్రయోగాలు అతని అడుగు జాడల్లోనే నడపదల్చుకున్నాను..." అని క్షణం ఆగి "అతని అబ్జర్వేన్ నోట్ బుక్ లో అక్షరుసారిగా అతను వ్రాసిందాన్ని బట్టి వాతావరణాన్ని శాసించే ప్రయోగాల నతను అనుకోకుండా చేసినట్లు అర్థమవుతోంది. ఇదెవ్వరికీ తెలియదు. నేనూ అతని ఫీల్డువాడినే కాబట్టి నాకర్థమైంది" అన్నాడు స్వామి.

కరుణ ఆశ్చర్యంగా స్వామివంక చూసి "అది సాధ్యమా?" అంది.

"సాధ్యమో కాదో నాకు తెలియదు. రేపే మొదలు పెట్టి చూస్తాను" అన్నాడు స్వామి.

9

"మిస్టర్ స్వామీ!" అన్నాడతను.

"డాక్టర్ స్వామి" సవరించాడు స్వామి.

"అయాం సారీ డాక్టర్ స్వామీ మీతో చిన్న పనుంది" అన్నాడతను.

"మీరెవరో తెలుసుకోవచ్చా?"

"నేనెవరో మీకనవసరం. నన్ను మీ శ్రేయోభిలాషిగా గుర్తుంచుకోండి చాలు."

"నా శ్రేయస్సు నేను చూసుకోగలను. వేరే శ్రేయోభిలాషుల అవసరం నాకు లేదు" అన్నాడు స్వామి.

అతను తన అరచేతిని స్వామిముందు చూపించాడు. స్వామి ఆశ్చర్యంగా అతనివంక చూశాడు. ఆ అరచేతిలో

ఒక అందాల సుందరి ఫోటో వుంది. "మీరు నాతో వస్తే తిన్నగా ఈ అమ్మాయియున్న యింటికే వెడదాం. ఆమెను మీకు పరిచయం చేసి నాదారిన నేను వెడతాను" అన్నాడతను.

"మీ ఉద్దేశ్యమేమిటో నాకర్థం కాలేదు కానీ మీతో రావడానికి నాకభ్యంతరం లేదు. అయితే ముందుగా మీకో విషయం చెప్పడం నాబాధ్యతగా భావిస్తున్నాను. సెక్స్ నా బలహీనత. ఆడపిల్లతో నాకేకాంతం కల్పిస్తే ఆపైన నేనేం చేస్తానో నాకే తెలియదు. అటుపైన మీయిష్టం" అన్నాడు స్వామి.

అతను మాట్లాడకుండా ఫోటో జేబులోకి పోనిచ్చి స్వామి చేయి పట్టుకుని రెండడుగులు ముందుకువేసి రిక్షాను పిలిచి బేరమాడేడు. స్వామికూడా రిక్షా ఎక్కేడు. రిక్షా ఒకింటిముందు ఆగేక అతను స్వామితో "అదిగో ఆ ఇల్లే అందులోకి వెళ్ళండి మీ సరదా తీర్తుంది. నాపనీ అవుతుంది" అన్నాడు.

"జేబులో డబ్బాట్టే లేదు. సరదా తీర్చుకుందుకు డబ్బివ్వలేను" అన్నాడు స్వామి అనుమానంగా.

అతను నవ్వి "మిస్టర్ స్వామీ..." అని ఏదో చెప్పబోయాడు.

"డాక్టర్‌స్వామి" స్వామి సవరించాడు.

"సారీ డాక్టర్‌స్వామీ నేను మీకు డబ్బు లభించే పనేకానీ డబ్బు ఖర్చయ్యేపని చెప్పను" అని "ఇక వెళ్ళండి నాకింకో చోట పనుంది" అన్నాడు.

స్వామి రిక్షా దిగి ఆ యింటికి వెళ్ళాడు. తలుపులు పూర్తిగా వేసిలేవు. అతను తోశాడు.

సోఫా కమ్ బెడ్ మీద పడుకున్న ఓ యువతి చటుక్కున లేచి కూర్చుంది. ఆమె బికినీలో వుంది. స్వామి ఆమెను చూస్తూనే ఆవేశపడ్డాడు.

"ఎవరు మీరు?" అందామె.

"డాక్టర్ స్వామి" అన్నాడతను.

"ఓహ్! మీరు సైంటిస్టు కదూ?" అంటూ ఆమె పరుగున అతన్ని సమీపించి అతని చేయి పట్టుకుని "సైంటిస్టులంటే నాకు చాలా ఇష్టం" అంది.

"నువ్వు వేశ్యవా?" అన్నాడు స్వామి.

"కాదు. నాకు డబ్బుంది. వెరైటీ కావాలి. ఇష్టమైన మగవాళ్ళని రప్పించుకుంటూంటాను. నేనే డబ్బు ఇస్తాను. సైంటిస్టులంటే నాకు చాలా ఇష్టం" అందామె.

"అయితే నే నిప్పుడు మగ వేశ్యనవుతానన్నమాట" అన్నాడు స్వామి.

"నేనంటే మీ కిష్టం లేనప్పుడు మీరు మగ వేశ్య ఔతారు. నా అభిప్రాయంలో మగవాళ్లెన్నటికీ వేశ్యలే కాలేరు. ఎందుకంటే అందమైన ఆడది పిలిచిందంటే సంతోషంగా వాళ్లు సిద్ధపడతారు. ఆడదాని సంగతలా కాదు. డబ్బుకోసం ఇష్టమున్నా లేకపోయినా ఒళ్ళమ్ముకుంటుంది" అందామె.

ఒక పావుగంట అనంతరం సోఫాకమ్ బెడ్ మీద తన పక్కనే ఉన్న ఆ అమ్మాయితో "నీ పేరుకూడా తెలుసుకోలేదు—చెబుతావా?" అన్నాడు.

"రమణి" అని నవ్విందామె. "మీలాంటి ఆవేశపరుణ్ణి నేనింతవరకూ చూడలేదు. మీరు నాకు నచ్చారు. మీకు వెయ్యి రూపాయలు బహుమతిగా ఇస్తే తీసుకుంటారా?" అంది.

"ఎందుకు తీసుకోను? అందరాండవాళ్లూ నీలా డబ్బు తీసుకోరని గ్యారంటీ ఏమిటి? వచ్చినచోట రాబట్టుకోవడం అవసరమైనచోట ఖర్చుపెట్టడం—ఇదీ నా పద్ధతి. రాబడైనా, ఖర్చయినా నాకు ఆడవాళ్ళ మూలంగానే" అన్నాడు స్వామి.

"కానీ మీరు నాకు మీ గురించి చెప్పాలి. మీరు లాబరేటరీలో ఏమేం చేస్తారో, ఏయే పరిశోధనలు చేస్తున్నారో..."

రమణిని మధ్యలో ఆపి "ఇటీవల ఆడవాళ్ళందరికీ శాస్త్రపరిశోధనల మీద ఆసక్తి మళ్ళుతోందే! కారణమేమిటి?" అన్నాడు స్వామి,

రమణి తడబడింది. "ఏముంది? సైన్సు సాధించిన ప్రగతిలో ఆడవాళ్ళ దృష్టి సైంటిస్టులమీద మళ్ళింది. శాస్త్ర తెలివైన ఆడదెప్పుడూ నూతనత్వాన్ని కోరుతుంది. మిగతావాళ్ళంతా ఎప్పుడూ పాత వాసన కొట్టే కవిత్వాలూ, అంగాంగ వర్ణనలూ తప్ప—ఇంకేమీ చెప్పలేరు. ఈ సృష్టిరహస్యాన్ని ఛేదిస్తూ—సృష్టితీరునే మార్చగల సైంటిస్టుల పరిశోధనలు వినడానికి నాకు చాలా థ్రిల్లింగ్ గా ఉంటాయి."

స్వామి ముఖంలో గర్వం కనిపించింది. "అలాంటి పరిశోధనే నేనొకటి చేస్తున్నాను. పూర్వం శేఖరం అనే సైంటిస్టు—కొన్ని ప్రయోగాలు చేసి ఆపేశాడు. ఆ తర్వాత అత నుద్యోగమే మానేసి ఒకసారి ప్రధాన మంత్రిమీద నే చేయి చేసుకోబోయి పోలీసుల పాలయ్యాడు. చాలా కఠిన శిక్షలనతనూ, అతని భార్యా అనుభవిస్తున్నారని విన్నాను. ఆ ప్రయోగాల నిప్పుడు నేను

మళ్ళీ కొనసాగించేను. వాతావరణంలో హఠాత్తుగా మార్పులు తీసుకురావచ్చు. కోరినప్పుడు కోరినంత వర్షం కురిపించవచ్చు. నా ప్రయోగాలు విజయవంతం కాబో తున్నాయి.''

రమణి నవ్వి ''శేఖరం ప్రయోగాలు మధ్యలో ఆపేశా నంటున్నారు ఎందుకో తెలుసా?''

''నీకు తెలుసా'' అన్నాడు స్వామి.

''ప్రకృతి శక్తి స్వరూపిణి. దానిని తన చెప్పు చేతుల్లోకి తీసుకోవాలనుకునే మనిషి సర్వనాశమైపోతాడు'' అంది రమణి.

''బాగుంది. మరి సైంటిస్టున్న దెందుకు?''

''ఎందుకా? సృష్టిరహస్యాన్నర్థం చేసుకుని జీవితాన్ని బాగుచేసుకోవడానికి తప్పితే సృష్టిక్రమాన్ని మార్చడానికి ప్రయత్నించరాదు. ఇలాంటి ప్రయోగాలు చేయడంకన్నా ఊరుకుంటే ఉత్తమం.''

''అందమైన ఆడపిల్లల్ని అర్ధనగ్నంగా చూసినప్పుడూ అర్ధవంతమైన ప్రయోగమున్నదని తెలిసినప్పుడూ ఊరు కోవడం నావల్లకాదు'' అన్నాడు స్వామి.

''కానీ ఊరుకోవాలి. తప్పదు!''

ఈ మాటలు రమణివి కాదు. రిక్షాలో తనను దిగబెట్టి నతనివి.

స్వామి నవ్వి ''మీరా?'' అన్నాడు.

''అవును మిస్టర్...''

''డాక్టర్...'' అందించాడు స్వామి.

''ఎస్. డాక్టర్ స్వామీ! మీరు మీ ప్రయోగాలు మానుకోవాలి. మానుకుంటే మీకు ఐదు లక్షల రూపా యలు లాభిస్తుంది. ఉద్యోగం మానేయవచ్చు. కోరినప్పు

డల్లా మీకే ఎదురిచ్చే అందాల పడతులు దొరుకు తారు..."

"మానకపోతే..."

"మీ శృంగారలీలలు ఫొటోలుగా ముఖ్యమైన స్థలాల్లో పంచిపెట్టబడతాయి."

"ఓస్—ఇంతేకదా! పంచిపెట్టండి. నాకేం అభ్యంతరంలేదు. కానీ ఒక చిన్న సలహా. ఆ ఫొటోలు పంచిపెట్టడం బదులు ఖరీదుకు అమ్మండి. మీకు బోలెడు లాభం కూడా వస్తుంది" అన్నాడు స్వామి.

అతనాశ్చర్యంగా స్వామివంక చూసి "నేను వేళాకోళమాడ్డంలేదు. నిజంగానే ఫొటోలున్నాయి నా దగ్గర" అన్నాడు.

"లేవని నేననడంలేదు. శృంగారలీలలు నా వ్యక్తిగత జీవితానికి సంబంధించినవి. నే నెవర్నీ బలవంతంగా అనుభవించడంలేదు. ఇష్టంమీద నే ననుభవిస్తున్నాను. నన్నొక సచ్చరిత్రుడిగా పదిమందీ భావించాలని నేనాశించడం లేదు. నా ప్రవర్తన మంచిది కాదని ఉద్యోగం పోయిందనుకోండి. అయినా నేను విచారించను. నేను సాధించిన అద్భుత ఫలితాలతో నేను కోటీశ్వరుణ్ణి కాగలను. అందువల్ల ఒకళ్ళ డబ్బు కాశపడి నా వ్యక్తిత్వాల్ని చంపుకునే వాణ్ణి కాదు నేను..." అన్నాడు స్వామి.

"మిస్టర్ స్వామీ!" అన్నాడతను.

"డాక్టర్ స్వామి ప్లీజ్..." స్వామి చిరాగ్గా సవరించాడు.

అతను కోపంగా "ఓః డాక్టర్ స్వామీ—డబ్బు మీద ఆశ లేకపోయినా కనీసం ప్రాణాలమీదనైనా మీ

కాశ ఉందనుకుంటూను" అన్నాడు.

"బాగుంది. ఎందుకుండదు?" అన్నాడు స్వామి.

"అయితే ప్రయోగాలు మానేసి ఉద్యోగానికి రాజీ నామా ఇవ్వండి..." అన్నాడతను.

"ప్రాణాల ప్రశక్తి తీసుకొచ్చారు కాబట్టి కాస్త ఆలోచించాలి..." అన్నాడు స్వామి.

10

"కంగ్రాట్యులేషన్స్ డాక్టర్ స్వామీ" అన్నాడు చంద్రశేఖర్.

"డాక్టర్ కాదు మిస్టర్..." సవరించాడు స్వామి.

లాబరేటరీలో జరుగుతున్న ఆసమావేశంలో సంస్థ డైరెక్టరుతోపాటు పోలీసుశాఖకు చెందిన పలువురు ప్రముఖులున్నారు. చంద్రశేఖర్ చెప్పడం ప్రారంభించాడు.

"మన దేశం వైజ్ఞానికంగా సాధించే ప్రగతిని అభివృద్ధి చెందిన దేశాలన్నీ చాలా తక్కువ అంచనా వేశాయి. న్యూక్లియర్ ఎక్స్‌ప్లోజన్, శాటిలైట్—ఈ రెండూ వారికి కనువిప్పు కలిగించగా మూడు సంపన్న దేశాలు మన దేశంలో జరుగుతున్న పరిశోధనల గురించి తెలుసు కునేందుకు రహస్యచారుల్ని నియమించాయి.

వారి నివేదికను గమనించేక వైజ్ఞానికంగా, సాంకేతికంగా భారతదేశం చాలా వేగంగా అభివృద్ధి చెందనున్నదని ఆ మూడు సంపన్న దేశాలూ గుర్తించాయి. వెంటనే ఆ మూడుదేశాలూ కలిసి ఒక బృందాన్ని పంపించాయి. ఆ బృందం పనేమిటంటే దేశపు భవిష్యత్తునే మార్చి వేయగల పరిశోధనలను ఆపుచేయించడం. శాస్త్రజ్ఞులను

బెదిరించిగానీ, ప్రలోభపెట్టిగానీ ఆయా ప్రయోగాలను మానిపించడం.

అటువంటి సందర్భంలోనే శేఖరం చిక్కుకున్నాడు. అతను చేసిన ప్రయోగం విజయవంతమైతే వాతావరణంలో కోరినప్పుడు కోరినంత వర్షం కురిపించవచ్చు. ఇది భారత దేశపు టార్థిక స్వరూపాన్నే మార్చివేస్తుంది. ఎప్పటి కప్పుడు తమ ఏజంట్లద్వారా ఈ విశేషాలు తెలుసు కుంటున్న ఆ ముఠా శేఖరాన్ని బెదిరించి ఉద్యోగానికి రాజీనామా ఇప్పించింది..." చంద్రశేఖరం ఆగాడు— ఎవరో ప్రశ్న వేయబోతున్నారని చూసి.

సంస్థ డైరెక్టరు "శేఖరం రాజీనామాకు కారణమది అనినాకు తెలియదు. అయితే దేశంలోని ప్రతి సైంటిస్టూ ఈ విధంగా కార్నర్ చేయబడుతున్నాడా?" అన్నాడు.

"లేదు. దేశపు టార్థిక స్వరూపాన్ని మార్చివేయగల పరిశోధనలు చేసే సైంటిస్టులనే వారు కార్నర్ చేస్తు న్నారు. శేఖరం అణుకిరణాలను వ్యవసాయాని కుపయో గించే ప్రయోగాలు చేస్తున్న వ్యక్తి. అందువల్లనే అతను వారి దృష్టిలో పడ్డాడు. వారినుంచి తప్పించుకునే దారి తోచక చివరకతను ప్రాణాలు తెగించి ఒక నిర్ణయానికి వచ్చాడు. ప్రధానమంత్రిపైన చేయిచేసుకునేటందుకు అతనూ, అతని భార్యా సిద్ధపడ్డారు. ఆవిధంగా ఆ భార్యా భర్తలిద్దరికీ తిరుగులేని పోలీసు కస్టడీ లభించింది.

ప్రధానమంత్రిమీద చేయి చేసుకోబోయినవారు కాబట్టి వీరికి ప్రత్యేక గుర్తింపూ, ప్రత్యేక రక్షణా ఏర్పా టయ్యాయి. అక్కడ భార్యాభర్తలు చెప్పిన మాటలు ముందుగా పోలీసులు నమ్మలేదు. దానికి తోడు శేఖరం

ఇంట్లో దొరికిన ఉత్తరాలూ, దొంగనోట్లూ అతన్ని దేశ ద్రోహిగా నిరూపించాయి.

దేశద్రోహినని ఒప్పుకోడానికి తనకభ్యంతరం లేదనీ కానీ తన మాటల్లో నిజం గ్రహించవలసిందనీ పోలీసుల్ని అతను కోరాడు. అతని మాటలే నిజమైతే అతన్ని వెంటాడిన ముఠాను పట్టుకోవలసిన బాధ్యత పోలీసులకుంది. అప్పుడే ప్రభుత్వం రికమెండేషన్ మీద స్వామి-శేఖరం స్థానంలో నియమించబడ్డాడు సైంటిస్టుగా. అతనితో మాట్లాడిన ప్రతి అనుమానాస్పద వ్యక్తి మీదా పోలీసు నిఘా ఏర్పాటయింది. స్వామి తన ప్రవర్తనలో ఎవరికీ అనుమానం కలగకుండా మసలగలిగాడు.

సుమారు నెలరోజుల్లో పోలీసులకు ముఠాకు సంబంధించిన వివరాలన్నీ పూర్తిగా తెలిసిపోయాయి. ఇప్పుడు ఆ ముఠా పట్టుబడింది'' అన్నాడు ఐ. జి. చంద్రశేఖర్.

* * *

శేఖరం మళ్ళీ ఉద్యోగంలో చేరేక—ఆ దంపతులిద్దరూ మళ్ళీ పూర్వపు ఇంట్లోనే అద్దెకు ప్రవేశించారు.

వారి పక్కనున్న అందమైన బంగళాలో ఇప్పుడు కరుణ లేదు. ఎవరో ధనవంతుడా ఇల్లు కొనుక్కున్నాడు. ఆయన భార్య అరుణ కూడా కరుణలాగే అందమైనది. వయసులో ఉన్నది. ఆమె భర్తకూడా ఎప్పుడూ వ్యాపారం పేరుమీద బయట కాలం గడుపుతూంటాడు. అందువల్ల ఆమెకు ఇరుగుపొరుగుతో కాలక్షేపం చేయడం సరదా.

ఆ సరదాకొద్దీ ఆమె మొట్టమొదటగా సావిత్రి స్నేహాన్నభిలషించింది. కానీ సావిత్రి ఆమెను దరిదాపులకు

కూడా రానివ్వలేదు సరికదా__ఆమెతో తగువుకూడా పెట్టుకుంది.

అందరూ చాలా మంచిదనే సావిత్రి, చూడ్డానికి సంస్కారవంతురాలిలా కనిపించే సావిత్రి, తనెందుకు దగ్గరకు రానివ్వదో అరుణకు తెలియదు. తెలుసుకోడానికి ప్రయత్నించాలనుకుని "అయినా మనకెందుకు లెద్దూ. ఆవిడ స్నేహం లేకపోతే నాకేమైనా లోటొచ్చిందా? ఇలాంటి విషయాల్లో ఊరుకోవడమే ఉత్తమం" అనుకుని మానేసింది ఆవిడ.

—: ఐపోయింది :—